# చక్ర భ్రమణం

(కథానిక)

కాలేజీలో గరల్స్ వెయిటింగ్ రూమ్ దగ్గర తారట్లాడుతున్నాడు చక్రధరరావు. లోపలి నించి గాజుల కబకల ధ్వనులూ, కిలకిల నవ్వులూ వినిపిస్తున్నాయి. లోపలికి వెళ్ళటానికి ధైర్యం చాలటంలేదు అతనికి. అతనెప్పుడూ అపరిచిత స్త్రీలతో మాట్లాడలేదు. అదికాక వాళ్లు తన ప్రవర్తనని ఎలా అర్థం చేసుకుంటారో ననే భయం కూడా కలిగిందతనికి. ఇలా ముందు ఆలోచిస్తున్న చక్రధరరావుకి చప్పున ఓవిషయం జ్ఞాపకం వచ్చింది. తనకి మంచిదని తోచిన విషయం, దాని ఫలితాలని గురించి ఇతరులు ఏం అనుకున్నా సరే, వెంటనే ఆచరణలో పెట్టేయాలని అతని స్థిరసంకల్పం. ఈ ఊహ అతనికి తట్టగానే అతను ఆలోచనలన్నీ మానివేసి సరాసరి వెయిటింగ్ రూమ్‌లోకి వెళ్ళాడు. రూమ్‌లో ఉన్న స్త్రీలందరూ ఒక్కసారిగా నవ్వు ఆపేసి అర్థంకాని బిత్తర చూపులు చూశారు.

'క్షమించాలి...' చక్రధరరావు గది గోడల వైపు చూస్తూ అన్నాడు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

'మీ ఇళ్ళలో ఎవరికన్నా ట్యూషన్ కావా లేమోనని' – అతను ఆగాడు అసంపూర్తిగా. సంగతి తెలుసుకున్న విద్యార్థినులు ఆశ్చర్యాందోళనలు ప్రకటించటం మానుకుని 'అదా సంగతి' అన్నట్టు చిన్నగా నవ్వారు.

'దయచేసి ట్యూషన్ కావాలిస్తే ఈ అడ్రసుకి కాస్త కబురుచేయండి.' అతను జేబులోంచి ఓ చిన్న కాగితంతీసి బల్లమీద పడేసి వెళ్లిపోటానికి వెనక్కి తిరిగాడు.

'ఇదో వేషం.'

'ట్యూషనట! కావాలా సులోచనా?'

'మనకి కాదు. ఇంట్లో వాళ్ళకేఁ!'

తనని అపహాసించే స్వరాలు విని చక్రధరరావు కాస్త కించపడ్డాడు. వెళ్లిపోయేవాడల్లా మళ్లీ వెనక్కి తిరిగి

'అవునండి, నా ఉద్దేశం అదే. ఇంట్లో చిన్నపిల్లలెవరైనా ఉంటే ట్యూషన్ కావాలేమో నని అడిగాను. మీకు చెప్పగలవాడిని కానని నాకు తెలుసు.'

'అతి వినయం ధూర్త లక్షణం.' అంది సులోచన స్థానబలిమి చూసుకొని.

'అపార్థం చేసుకుంటే, క్షమించండి.'

'అపార్థం చేసుకుంటేగా!' చక్రధరరావు ఏమీ అనలేదు. ఒక్కసారి తలెత్తి చూసి ముందుకు సాగాడు.

'పుస్తకాలరావుకి ఎంత ధైర్యం వచ్చిందివాళ!'

చక్రధరరావుకి మారుపేరు పుస్తకాలరావు. అతనెప్పుడూ క్లాసులో ఒంటరిగా, వేరే బెంచిమీద కూర్చుంటాడు. ఎవరితో కూడా సరిగా మాట్లాడడు. ఏమాత్రం విరామం దొరికినా ఏదో పుస్తకం ముందు వేసుకుని కూర్చుంటాడు. సాయంత్రం ఆటలు ఏవీ ఆడడు. సరాసరి రూముకి వెళ్లిపోతాడు. అతని రూములో రాత్రి రెండుగంటలదాకా రోజూ దీపం జాజ్వల్యమానంగా వెలుగుతూ ఉంటుందని వినికిడి. తోటి బి.ఏ. విద్యార్థులందరికీ అతనంటే ఓవిధమైన కోపం, అసహ్యం.

సులోచన అన్న మాటలు విని చక్రధరరావు గభాలున మళ్లీ రూములోకి వొచ్చి తీక్ష్ణంగా అన్నాడు:

'అవును, పుస్తకాలరావుకి చాలా ధైర్యం ఉంది. మొండి ధైర్యం! ఇంకా అంతకంటే మంచిమాట, తెగువ! ఎవరు ఏమి అనుకున్నా నాకేం లెక్కలేదు! నేనేమీ బాధపడను. బాధపడే దశ దాటిపోయింది. ప్రపంచం గురించి మీకేం తెలుసు? ఏమీ తెలియనివాళ్ల మాటల్ని నేనేం పట్టించుకోను.'

'పట్టించుకోకపోతే ఇంత ఉపన్యాసమెందుకు?' అంది సులోచన.

గొప్పగా మాట్లాడానని మన

హితశ్రీ

సులోచన అనుకుని తోటి విద్యార్థినుల వైపు సగర్వంగా చూసిందామె.

'మీ పేరేమిటి?'

'ఎందుకూ? సులోచన.'

'పేరుకి తగ్గట్టు కళ్లు బాగానే ఉన్నాయి కాని, వాటిలో తీక్ష్ణత లేదు.'

'ఇహ మీరు దయచెయ్యొచ్చు.' అంది సులోచన రోషంతో.

'సిల్కు చీరలవాళ్లకి విచక్షణ ఉంటుందని నేనెప్పుడూ అనుకోలేదు.' చక్రధరరావు తన షర్టు చిరుగువైపు భావగర్భితంగా చూసి, తలెత్తి విషాదంగా నవ్వి గబగబ రూముదాటి వెళ్లిపోయాడు. సులోచన అభిమానం దెబ్బ తిన్నది.

'పైకి అమాయకంగా కనపడేవాళ్లంతా ఇంతే.'

అంతా నవ్వారు. మళ్లీ వెయిటింగు రూములో గాజుల కలకల ధ్వనులూ, కిలకిల నవ్వులూ ప్రారంభమయాయి. సులోచన మాత్రం పరధ్యానంగా ఏదో ఆలోచిస్తోంది.

చక్రధరరావు చివర అన్నమాటలు సులోచనకి ఎంతో సంక్షోభం కలిగించాయి. సులోచన ధనికవర్గానికే చెందినా ధనిక వాదానికి చెందినదికాదు. తన కళ్లలో తీక్ష్ణత లేదని అనటంలో చక్రధరరావు ఉద్దేశం కేవలం తనని గాయపరచటం కాదని ఆమె నమ్మింది. అతను అన్న మాటలలో భావం తను వెల్లడించిన భావాలు అర్థం చేసుకునే శక్తి ఆమెకి లేదని ఆరోపించటమేనని ఆమె కర్థమయింది. 'ప్రపంచం గురించి మీకేం తెలుసు?' అని అనటంలో అతని వేదన, "బాధపడే దశ దాటిపోయింది." అని అనటంలోగల మర్మధ్వని ఆమెని కలత పెట్టాయి. చక్రధరరావు బీదవాడని అందరికీ తెలిసిన విషయమే. అతను పొద్దునపూట ట్యూషన్‌లు చెప్పి ఎలాగో నాలుగు డబ్బులు సంపాదించుకుంటాడని కూడా అందరికీ తెలుసు. అటువంటప్పుడు అతని చర్యని వేరే విధంగా అర్థంచేసుకోటం తనదే తప్పు. అతనికి అనవసరంగా బాధ కలిగించినందుకు సులోచన మెత్తని మనస్సు పరితపించ సాగింది. ముఖ్యంగా తనని హృదయం లేనిదానినిగా అతను ఊహించుకోటం ఆమెకి దుర్భరమయింది. ఆమెకి బీదల కష్టాలు తెలియక పోలేదు; ఎందరో బీద విద్యార్థులకి సహాయం చేసిందికూడా. అటువంటి తనని చక్రధరరావు ధనికస్వాముల్లో చేర్చి సిల్కు చీర ప్రసక్తితో తనని ధనిక వాదానికి ముడిపెట్టడం అన్యాయం. ఇంతకీ తన ఇంట్లో ట్యూషన్ నిజానికి అవసరమే. తన తమ్ముడి ట్యూటర్ మానేశాడు. కొత్తవాడిని ఎలాగూ పెట్టాలి. అయినప్పుడు చక్రధరరావునే ఎందుకు నియమించకూడదు?

* * *

'ఏయ్ రిక్షా, నిన్నే.' కొంచెం విసుగ్గా గట్టిగా అంది సులోచన.

ఏమిటో ఆలోచిస్తూ, అప్రయత్నంగా గంట వాయిస్తూ నడుస్తున్న రిక్షావాలా ఈ కేక విని తలెత్తి చూశాడు. మసక చీకటి పడ్డది. ఎవరో స్త్రీ నీడలా దగ్గర్లో కనిపించిందతనికి.

'వొస్తున్నానమ్మా.'

'చెవుడా. ఏ అధ్యానమా? నాలుగుసార్లు పిలిచినా పలకవేం?'

రిక్షావాలా చిన్నగా నవ్వి 'ఎక్కండి' అన్నాడు. సులోచన రిక్షా ఎక్కి కూర్చుంది.

'ఇలా అయితే నువ్వు బాగానే సంపాదిస్తావు!' రిక్షావాలా మాట్లాడలేదు. కాసేపాగి సులోచన అంది,

'ఏమోయ్, నువ్వెంత సంపాయిస్తావు రోజుకి?'

'......'

సులోచన నవ్వుకొంది. ఇంత పరధ్యానం మనిషి రిక్షా లాగి ఎలా జీవితం గడుపుతాడో నని ఆశ్చర్యపడ్డ దామె - మూడుసార్లడిగిన తరవాత రిక్షావాలా అన్నాడు:

'ఏదో, నాకు సరిపోయేటంత వొస్తుంది లెండి.' సిమెంటు రోడ్డుమీద రిక్షా నిశ్శబ్దంగా జారిపోతోంది. ఉన్నట్టుండి చటుక్కున సులోచనకి చక్రధరరావు మాటలుజ్ఞాపకం వొచ్చాయి. 'సిల్కు చీరలవాళ్లకి విచక్షణ ఉంటుందని నేనెప్పుడూ అనుకోలేదు.' వెంటనే ఆమె ఆలోచన చరచర లాగుతున్న రిక్షావాలా మీదికి పోయింది. నరవాహనం! అమాత్రం విచక్షణ లేకుండా తోటిమానవుడిచేత బండీ లాగించు

ళోటం! సులోచన మనస్సు చలించింది. అసలు మనుష్యులు రిక్షాలు ఎందుకు లాగుతారు! ప్రభుత్వం ఈపని ఎందుకు నిషేధించలేదు?

ఈ రిక్షాలాగటం కంటె ఇంకోపని చేసుకో కూడదూ?' ఈసారి రిక్షావాలా వెంటనే సమాధానంగా అదోరకంగా నవ్వాడు.

'రిక్షాలాగటం నీకు అవమానకరంగా లేదూ?'

'అడుక్కోటం కంటే ఇదే నయం'

'ఇంకోపని చేసుకోవచ్చుగా'

'మేం రిక్షాలులాగకపోతే, పాపం మీరంతా ఇబ్బంది పడతారుగా'.

సులోచన నవ్వింది. రిక్షావాలా చమత్కరించాడు!

'రిక్షాలు లాగటం ప్రభుత్వం నిషేధించాలి.'

'డబ్బున్నవాళ్లు ఒప్పుకోరు. జట్కాల్లో పోతే వాళ్ళ డబ్బు తగ్గిపోదూ?'

'నిషేధిస్తే, నువ్వేం చేస్తావు తరవాత?'

'సంవత్సరంలోగా అటువంటి దేదీ జరగదు. సంవత్సరం తరవాత నేను రిక్షా లాగను'

'ఏం?' రిక్షావాలా సమాధానం ఇవ్వలేదు.

'నువ్వుకూడా చదువుకుంటే ఉద్యోగం చేసే వాడివికదా! అన్నట్లు రాత్రిళ్లు చదువు నేర్చుకో రాదూ?' అంది సులోచన, చదువురాని వాళ్లని గురించి, వాళ్ళ అజ్ఞానాన్ని గురించి ఆలోచిస్తూ. రిక్షావాలా వింతగా నవ్వాడు.

'చాలామంది కంటె నాకు బాగానే చదువొచ్చు' సులోచన కాస్త ఆశ్చర్య పడ్డది. ఆమెకి అకస్మాత్తుగా ఓ విషయం స్ఫురించింది. ఈ రిక్షావాలా అంత యాసగా మాట్లాడటం లేదు. చూస్తే, పాపం యితను కాస్త ఓ మాదిరి చదువు వొచ్చిన వాడో, లేకపోతే వాళ్ళతో తిరిగినవాడో అయి వుండాలి' అనుకుందామె.

'ఏమిటో ఈ ప్రపంచం! చదువుకోటానికి, ఉద్యోగాలు చెయ్యటానికి అందరికీ సమానావకాశాలుంటే ఎంత బావుంటుంది.' సులోచన ఈ మాటలు అర్థ స్వగతంగా అంది.

'మాబోటి బీదవాళ్లు పైకిరావాలంటే అసలు ఇప్పుడున్న వ్యవస్థే మారాలి. బూర్జువా...' రిక్షావాలా అకస్మాత్తుగా ఆగాడు.

సులోచన చకిత ఐంది. రిక్షావాలా ఆర్థిక శాస్త్రం రాజకీయాలు మాట్లాడు తున్నాడు!

'కమ్యూనిస్టులు కొట్టిపోసి ఉంటారు' అనుకుంది సులోచన. ఆమె ఇహ ఏమీ మాట్లాడలేదు.

'అ... ఇక్కడే, ఆపు.'

'ఇక్కడా! ఈ రూము దగ్గిరే!'

'అవును.' రిక్షా ఆగింది.

రూమ్‌లో కాంతి హీనంగా ఓ దీపం వెలుగుతోంది. సులోచన రిక్షా దిగి, రూమ్‌కి తాళం వేసి ఉండటం చూసి మళ్లీ రిక్షా దగ్గిరికి వొచ్చింది.

'తాళంవేసి ఉందే!'

'ఈ రూములో ఉండే ఆయన నాకు తెలుసమ్మా, ఆయన తొమ్మిదింటికిగాని రాడు. రోజూ అంతే.'

'నీకెలా తెలుసు?'

'రోజూ నేను ఇటు తిరుగుతూనే ఉంటాను గదండి.'

సులోచన ఓ క్షణం ఆలోచించి, ఓ కాగితం మీద ఏదో రాసి కిటికీలోంచి గదిలో పడేసి, తిరిగొచ్చింది. రిక్షావాలా ఎందుకో రిచ్చపాటు పొందాడు

రిక్షా వెనక్కు తిరిగింది. రిక్షావాలా గమనం హెచ్చించాడు. కాడికట్టుకు గుర్రంలా పరిగెత్తే అతనిని చూసి సులోచన హృదయంలో ఉద్వేగం జనించింది.

'ఇరవయ్యో శతాబ్దపు విజ్ఞానం' విషాదంగా తనలో తను అనుకుంది సులోచన.

చమటలు పోస్తున్నకొద్దీ ఇంకా వేగంగా లాగుతున్నాడు రిక్షావాలా. అతనిపాదాలు కసిగా, కోపంగా భూమిని తొక్కుతున్నాయి.

సులోచన రిక్షా సీటుకింద పదిరూపాయల కాగితంపెట్టింది. ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి. 'ఇహ ఎప్పుడూ రిక్షాఎక్కను.' అనుకుందామె.

'ఆపు.'

రిక్షాఆగింది. సులోచన దిగి అతని చేతిలో ఓ రూపాయి పెట్టి తన ఇంటి గేటువైపు నడిచింది.

'ఏయ్, రిక్షావాలా! వొస్తావా?'

'ఎక్కడికి?'

'దగ్గిరేలే, నాలుగు ఫర్లాంగులు కూడా ఉండదు.'

'అర్థరూపాయి'

'పావలా.'

'ఊఁహుఁ' రిక్షా వాలా నిర్లక్ష్యంగా ముందుకు సాగాడు.

'పిల్లకెంత పొగరు! మళ్లీ మాటకూడా మాట్లాడడు. సరే రా.' ఓ పిప్పళ్లబస్తాలాంటి ఆయన రిక్షా ఎక్కాడు.

'పోనీ, చచ్చినదకా, నువ్వా - గుర్రంలా పోవాలి!'

గేటుదగ్గిర నుంచొని రిక్షావైపు చూస్తున్న సులోచన 'గెట్ డవున్' అనే గంభీరమైన కేక విని అదిరి పడ్డది. ఆమెకి అనతిదూరంలో రిక్షా లోంచి దిగి ఓ స్థూలకాయుడు నడుస్తున్నాడు. కాసేపటిలో మళ్లీ రిక్షా సాగిపోయింది. రిక్షా గంట అస్పష్టంగా వినిపిస్తోంది. దూరంలో రిక్షా చీకటిలో మాయమయింది. సులోచన బరువుగా నిశ్వసించి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

* * *

'అయితే సాయంత్రం మీకు తీరదన్నమాట.'

'క్షమించాలి. సాయంత్రంవేళల్లో నాకు చాలా పని ఉంటుంది. పొద్దునపూట ట్యూషన్ ఏర్పాటుచేస్తే చాలా సంతోషిస్తాను.'

సులోచన ఏదో ఆలోచిస్తోంది, చక్రధరరావుకి సమాధానం ఏమీ ఇవ్వకుండా.

'అన్నట్టు మర్చిపోయాను. నిన్న మీరు రిక్షాలో పదిరూపాయల కాగితం ఓటి పారేసుకున్నారుట. రిక్షావాడు మీకివ్వమన్నాడు.' అతను ఓ పదిరూపాయల 'కరెన్సీ కాగితం ఆమెకి అందించాడు. సులోచన ఆశ్చర్యపడ్డది. ఆమె ఆశ్చర్యం గమనించి అన్నాడతను, 'ఆ రిక్షా వాడిని నేను బాగా ఎరుగుదును. నిన్న మీరు మా రూమ్‌కి రావటం చూసి మనకి పరిచయం ఉందని అనుకున్నట్టున్నాడు. పొద్దున్నే ఇది మీకివ్వమని నా చేతికిచ్చాడు.'

'నేనేమీ పారేసుకోలేదే! ఇది ఎక్కడ దొరికిందతనికి?'

'రిక్షా సీటు అడుగున'

'సీటు అడుగున పారేసుకోట మేమిటి?'

'అయితే బుద్ధిపూర్వకంగానే ఇచ్చారా?'

'నేనిచ్చానని అనలేదు. ఆ నోటు నాదేనని ఆ రిక్షావాడి కెలా తెలుసు?'

చక్రధరరావు కొంచెం ఆలోచించిఅన్నాడు: 'ఇవాళ మొదటి బాడుగ మీదేట. మీరు దిగిపోయిన తరవాత ఎందుకో సీటు సర్దితే పది రూపాయలు కాగితం కనిపించిందన్నాడు.'

సులోచన నవ్వింది.

'అయితే నేను ఇచ్చింది మళ్లీ తీసుకోను.'

'ఆ రిక్షావాడు ధర్మం పట్టడు.'

'రిక్షావాడి తరఫునకూడా మీరే మాట్లాడితే ఎలా? బుద్ధిపూర్వకంగా ఇచ్చానని తెలిస్తే అతను తీసుకొనేవాడేమో. దయచేసి ఇది అతనికి తిరిగిచ్చేయండి.'

'ధర్మం పట్టదలచుకుంటే అతను రిక్షా లాగే వాడే కాదు.' సులోచన అతని ముఖంలో ఓ విధమైన తీవ్రత గమనించింది. ఆమె ఏమీ మాట్లాడకుండా ఆ నోటుని తీసుకుంది. చక్రధర రావు ఆ నోటువైపు తిరస్కార సూచకంగా చూశాడు.

'నేనిటువంటి వింత రిక్షావాలాని ఎక్కడా చూడలేదు.'

'వింత! ప్రపంచమే వింత. అసహజమైన ఈ ఆర్థిక, సామాజిక వ్యవస్థలిలా ఉన్నంత కాలం వింతలకీ విశేషాలకీ కరువేమిటి? బహుశా చదువుకున్న రిక్షావాళ్లు వున్నారంటే మీరాశ్చర్యపడవొచ్చు.'

'ఆశ్చర్య పడను. నేనెరిగిన ఓ స్కూల్ ఫైనల్ కుర్రాడు రిక్షా లాగటం ఎరుగుదును.'

చక్రధరరావు నవ్వాడు.

'బి. ఏ. చదువుతున్నవాళ్లే రిక్షా లాగుతున్నప్పుడు స్కూల్ ఫైనల్ కుర్రాళ్ల విషయంలో విశేషమేముంది?' ఈ మాటలంటూ అతను సులోచన ముఖంలోకి చూశాడు.

'అవును.'

'బి. ఏ. విద్యార్థి రిక్షా లాగటం ఆశ్చర్యం కాదా?'

'మొదట్లో ఆశ్చర్యపడ్డాను, తర్వాత ఆశ్చర్యపడాలిసింది ఇందులో ఏమీ లేదని అనుకున్నాను.'

'ఏం?'

'ప్రపంచంమీద, ప్రస్తుతం మన దేశంలో ఉన్న ఆర్థిక అసమానత్వంమీదా కలిగే కసిని అవిధంగా తీర్చుకోటంలో ఓ విధమైన మానసిక తృప్తి ఉండవచ్చునని నా అభిప్రాయం.'

చక్రధరరావు ఓ నిమిషం స్తబ్ధుడై ఆలోచించాడు. సులోచన అకస్మాత్తుగా అంది.

'రిక్షా లాగటం మానివేయరాదా?'

అతను అదిరిపడి అన్నాడు, 'ఎవరు!'

'మీరే.'

'నేనా??'

'అవును'

చక్రధరరావు కంగారుపడ్డాడు.

'మీ కెలా తెలుసు?'

'నా కళ్లు అందమైనవే అయినా వాటిలో తీక్షణత లేదని మీరోసారి అన్నారు. బహుశా మీ అభిప్రాయం తప్పని మీరీ పాటికి గ్రహించే ఉంటారు.' చక్రధరరావేమీ మాట్లాడలేదు.

'రిక్షాలాగే వృత్తి మానివేయండి.'

చక్రధరరావు మనసులో రిక్షా చక్రాలు గిర్రున తిరిగాయి. అతని మనోఫలకంమీద తీవ్ర పద ఘట్టనంలో బర బరా తను రిక్షాలాగే చిత్రం కనిపించింది. క్షణంలో అతను ఉత్తేజితుడయ్యాడు.

'రిక్షా!' చ క్ర ధ ర రా వు పిచ్చివాడిలా నవ్వాడు.

'నేను లాగేది రిక్షా కాదు. అది రథం. అవును. జగన్నాథ రథానికి దారిచూపే చిన్న రథం. ఈ రథ చక్రాలు నగరం మారుమోగేట్టు గిరగిర తిరుగుతూనే ఉండాలి. రథచక్రాలు... రథ చక్రాలు... హా...హా. ఈ రథచక్ర భ్రమణం 'మరోప్రపంచం' చేరేదాకా ఆగేది కాదు. చక్ర భ్రమణం...హా...హా...' ఈ ధ్వనికి నిద్రపోయే శాంతి మేలుకోవాలి. వీధి వీధీ మోగిపోవాలి. ఈ పదఘట్టనంలో సర్వభేదాలూ నశించిపోవాలి. అందాకా ఈ చక్రభ్రమణం ఆగదు... రథ చక్రాలు. రథ చక్రాలు, భూ మార్గం పట్టిన రథ చక్రాలు.' ఒక్కసారి పిచ్చివాడిలా నవ్వేసి చక్రధరరావు చప్పున వెనక్కి తిరిగి గబగబ నడిచి పోయాడు.

సులోచన నిశ్చలంగా అతను పోయిన వైపే చూస్తూ నిలబడిపోయింది ప్రతిమలా.

నిశ్చల నదీజలంలో తెడ్డువేసి కెలికినట్టయింది ఆమె మానసిక పరిస్థితి. అయితే, పడవ ముందుకు సాగిపోవాలంటే నీళ్లు సంక్షోభం చెందక తప్పదనే నగ్నసత్యం ఆమెకి తెలియక పోలేదు.

'జగన్నాథ రథ చక్రాలు భూమార్గం పడుతున్నాయా?' అని ప్రశ్నించుకుంది సులోచన.

# పసిడి పలుకులు

ఎం. ఎస్. చలం

గాంధీగారి కీర్తిమందిర ప్రారంభోత్సవ సందర్భాన పటేలుగారి నోట కొన్ని పసిడి పలుకులు జాలువారినై! 'విజయప్రభ' దినపత్రిక నుండి వాటిని యథాతథంగా సేకరించి దిగువ పొందుపరుస్తూ వాటి పట్ల నా అభిప్రాయాలను సైతం క్రోడీకరిస్తున్నాను.

"ప్రపంచమంతా గాంధీ మహాత్ముని ప్రశంసిస్తున్నది; కాని ఆయన బోధలను సరిగా గ్రహించి అనుసరించడానికిమాత్రం ప్రపంచం సిద్ధంగా లేదు."

వీరు అన్నది ప్రజల నుద్దేశించి కనుక - ప్రపంచ ప్రజానీకం అసత్యవాదులనీ, హింసాపరులనీ వారి విశ్వాసంగా మనం భావించవలసి వుంది. ఏ మానవుడూ అబద్ధాల కోరుగా, హింసావాదిగా ప్రవర్తించాలని కోరుకోవటం లేదు. శాంతియుతంగా జీవించాలనే కోరుతున్నాడు. కాని పరిస్థితుల ప్రాబల్యంవల్ల మానవ ప్రవర్తన వక్రగతిని సాగుతోంది. పరిస్థితులను చక్క దిద్దవలసిన బాధ్యత ప్రపంచ పాలకులపై వుంది. వారిలో ఒకరైనా పటేలు గారిపైకూడా వుంది. అందుకు మారుగా యీ పరిపాలకులు యుద్ధ వాతావరణాన్ని సైతం సృష్టిస్తున్నారు. గాంధీ మార్గాన్ని అనుసరించవలసిన అవసరం పాలకులకు ఎంతైనావుంది.

"మహాత్ముడు తాను అవతరించదగిన సమయం కంటె చాల ముందుగా జన్మించాడని కొందరంటున్నారు. కొంతవరకు యీ విమర్శల్లో సత్యం వుంది."